రూ.3 కోట్ల భూమికి ఎసరు!

- కబ్జాకు కూటమి నేతల యత్నం
- అడ్డుకున్న రెవెన్యూ యంత్రాంగం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో ఆలయ భూములకు ఆనుకుని ఉన్న సర్వే నం .360/2లోని సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమి మంగళవారం అధికార పార్టీ నేతలు కొందరు కబ్జాకు యత్నించారు. జేసీబీలు పెట్టి చదును చేసేందుకు యత్నించారు. రెవెన్యూ అధికారులు అడ్డుతగలడంతో చేసేదిలేక తోకముడిచిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. సదరు భూమిలో 2004లో అప్పటి ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, అప్పటి ఎంపీ డాక్టర్ చింతా మోహన్ తమ తిరుపతి పార్లమెంట్ పరిధిలోని దళితులకు ఇంటి నివాస పట్టాలు మంజూరు చేశారు. ఏళ్లు గడిచినా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించకపోవడంతో 2008–09లో ఇచ్చిన పట్టాలను తహసీల్దార్ దేవేందర్‌రెడ్డి రద్దు చేసి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఆ భూమిని ప్రభుత్వ అవసరాలకు కేటాయించాలని అప్పట్లో అధికారులను ఆదేశించారు. తదనంతరం దానికి ఎదురుగా ఉన్న తొట్టంబేడు భూముల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. 2019లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఈదులగుంటలోని ఎస్సీ, ఎస్టీలకు ఒకటిన్నర సెంటు చొప్పున ఇంటి



పిచ్చాటూరు రోడ్డులో ఎవరో కబ్జాకు గురయిన భూమి

పట్టాలు ఇవ్వాలని లేఅవుట్ వేసి వసతులు కల్పించారు. తదనంతరం ఎన్నికలు రావడంతో అది కార్యరూపం దాల్చలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు నేతలు ఆ భూమిపై కన్నేశారు. ఆక్రమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి ఎంచక్కా అనుభవించాలని భావిస్తున్నారు. రాత్రికి రాత్రే జేసీబీలు పెట్టి చదును చేశారు. రాజీవ్‌నగర్‌లో ఆక్రమణల పేరుతో వందకు పైగా కట్టడాలు కూల్చిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దీనిపైన ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

నిబంధనలు అతిక్రమిస్తే జైలుకే

ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారులు అడుగు పెడితే ఉపేక్షించేది లేదు. పిచ్చాటూరు రోడ్డులోని ప్రభుత్వ భూమిలో ఎవరు అడుగుపెట్టినా జైలుకెళ్లాల్సిందే.

– లక్ష్మీనరసింహారావు, తహసీల్దార్

మద్యం దుకాణాల ఉద్యోగులు నిరసన


మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది


శ్రీకాళహస్తి: మూసివేసిన మద్యం షాపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ మద్యం షాపులలో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తగదంటూ మంగళవారం స్థానిక మద్యం షాపు వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి ఎసరు పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై అక్కసుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ తమని ఉద్యోగం నుంచి తొలగించిందని వాపోయారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించలేదని, ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాలు రానుండడంతో జిల్లాలోని 148 మద్యం దుకాణాలలో పనిచేస్తున్న 554 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, టీడీపీ నేతలకు ఉపాధి కల్పించడం, వేల కోట్ల రూపాయలను దోచుపెట్టటమే లక్ష్యంగా ప్రైవేటు మద్యం దుకాణాలకు లైసెన్సులు జారీ చేస్తోందని ఆరోపించారు. తమకు జీవనోపాధి చూపించాలని డిమాండ్ చేశారు. మరోవైపు సిబ్బంది ఆందోళనతో మద్యం షాపులు మూత పడ్డాయి. దీంతో మందుబాబు మద్యం కోసం షాపుల వద్ద పడిగాపులు కాశారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం మండలంలోని మద్యం షాపుల సిబ్బంది ఆయా ప్రాంతాల మద్యం దుకాణాల వద్ద ఆందోళన చేశారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న తమను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి, తమను తొలగించి, రోడ్డుపై పడేసిందని నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: తమను తొలగించడం తగదని నిరసిస్తూ ప్రభుత్వం మద్యం దుకాణాల ఔట్‌సోర్సింగ్ కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ జీతాలు ఇవ్వకపోగా ప్రైవేటు మద్యం దుకాణాలకు ప్రభుత్వం పూనుకోవడం ఎంతమాత్రమూ తగదని, ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన తమను తొలగించి కుటుంబాలను రోడ్డున పడేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా మద్యం షాపులు మూతపడడంతో మద్యం ప్రియులు పడిగాపులు కాశారు. కొందరు ద్విచక్ర వాహనాల్లో సమీప తమిళనాడు వైన్‌షాపుల బాట పట్టారు.

క్లుప్తంగా

గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ పంచాయతీ మూలబొందల గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు మంగళవారం సంజీవ సింహ ట్రస్ట్ చైర్మన్ వేంకటేశ్వర్లు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, వైద్యాధికారి దివాకర్ నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ తాను పేద కుటుంబం నుంచి చదివి పైకి వచ్చానని, చదువు విలువ తెలుసని, అందుకే పేద విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు సాయం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీఎంగా మునెయ్య


మునెయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఐకేపీ ఏపీఎంగా మున్నెయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇందిరమ్మ తొట్టంబేడు మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న మునెయ్య బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ముందస్తు దసరా వేడుకలు


అమ్మవారి వేషధారణలో బాలికలు

శ్రీకాళహస్తి: పట్టణంలో శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఘనంగా ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. నవ దుర్గల వేషధారణలో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. అలాగే బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. దసరా పండుగ విశిష్టతను ప్రిన్సిపల్ రూపాదేవి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, డీన్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జిలు కల్ప, వాసంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు


మొక్కలు నాటుతున్న సర్పంచ్ గంగాధరం

ఏర్పేడు: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని సర్పంచ్ గంగాధరం అన్నారు. మంగళవారం మండలంలోని మేర్లపాక డంపింగ్ యార్డు వద్ద స్వచ్ఛతా హి సేవలో భాగంగా మొక్కలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం వేయరాదని విజ్ఞప్తి చేశారు.

జిల్లా చెకుముకి పోటీలకు ఎంపిక


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

శ్రీకాళహస్తి: జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు–24 పోటీల్లో ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. మండలస్థాయిలో పోటీల్లో చేతన, భవిత, ఎస్.హాఫ్స అనే విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో సోమవారం ఆ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ విశాల అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవం..

రేణిగుంట: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, పర్యాటక ప్రదేశాలు, ఆహార నియమాలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాయని ఇండియన్ కలనరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ హెడ్ డాక్టర్ ఎం.త్రిలోక్ చందర్ అన్నారు. మండలంలో కుర్రకాల్వ సమీపంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం, ఓనం డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. పర్యాటక రంగంపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వంటల పోటీలను నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి వరల్డ్ టూరిజం ప్రకటించిన 'టూరిజం అండ్ పీస్' అనే అంశంపై తిరుపతి ఐఐటీ, ఐజర్ విద్యార్థులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం కలినరీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు వండిన ప్రత్యేక వంటకాలతో ఓనం విందు ఏర్పాటు చేశారు.

పౌర హక్కుల దినోత్సవం


మాట్లాడుతున్న చందమామల కోటయ్య

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం బసవయ్యపాలెంలో మంగళవారం ఘనంగా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చందమామల కోటయ్య మాట్లాడారు. పులి శ్రీకాంత్, జనమాల గురవయ్య, న్యాయవాది కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



కొత్తమారికుప్పంలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సత్యవేడు: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని, రైతులు ఆ దిశగా సాగాలని వ్యవసాయాధికారి మురళి కోరారు. మంగళవారం కొత్తమారికుప్పం, కాళమనాయుడుపేట పంచాయతీలో వ్యవసాయ అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వినియోగించాలని చెప్పారు. మైక్రో ఇరిగేషన్ పరికరాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు అవసరమైన రైతుల పేర్లు నమోదు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు డి.నాగమ్మ, టి.జయ, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, శ్రీరాములు రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఎంపీఈఓ కవిత, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

బుచ్చినాయుడుకండ్రిగ: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని శ్రీకాళహస్తి సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్లపల్లె, పల్లమాలలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేయటం వలన రసాయనిక మందులను వాడవలసిన అవసరం ఉండదని, పంటలు బాగా పండుతాయన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి భారతి, సిబ్బంది పాల్గొన్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ: పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి సహాయ వ్యవసాయ సంచాలకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


బాలాజి, దీపిక, హిమజ

సత్యవేడు: మండలంలోని సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. లాంగ్‌జంప్ రాష్ట్ర స్థాయి పోటీలకు టి.బాలాజి (9వతరగతి), సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు టి.దీపిక(10వ తరగతి), అండర్–14 కరాటే రాష్ట్ర స్థాయి పోటీలకు కేజీ. హిమజ(7వ తరగతి) ఎంపికయ్యారని చెప్పారు. వారిని పీడీ మురళి, కరాటే మాస్టర్ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు

ఏర్పేడు: మండలంలోని పల్లం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ మంగళవారం తెలిపారు. వడమాలపేట హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 రెజ్లింగ్ పోటీల్లో పల్లం విద్యార్థులు హర్షవర్ధన్, నాగరాజు, సూర్య, మోహనాచారి సత్తా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. పీఈటీ పుష్పవాణి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ఇంటింటా కాదు.. ఒకే చోట పింఛన్ల పంపిణీ


ఒక చోటుకు అందరినీ పిలిపించి పింఛన్ ఇస్తున్న సచివాలయ సిబ్బంది

నాగలాపురం: ఇంటింటా కాకుండా ఒకే చోటకు అందరినీ రమ్మంటూ పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వెస్ట్ దళితవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. అందరూ గుంపుగా వచ్చి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని సచివాలయ సిబ్బందిపై మండిపడ్డారు. ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు ఇవ్వాలని కోరారు.

గుట్టుగా రెవెన్యూ హెచ్చరిక బోర్డు తొలగింపు



గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు, ప్రభుత్వ భూములు


ఏర్పేడు: మండలంలోని వెంకటాపురంలోని ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును మూడో కంటికి తెలియకుండా తొలగించారు. వివరాలు..వెంకటాపురం రెవెన్యూలోని సర్వే నంబర్ 262–4లో 0.90 సెంట్లు అనాధీనం, ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని స్థానికులు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గత వారం ఆ ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ బోర్డును ఆగంతకులు తొలగించి దానిని మాయం చేశారు. మంగళవారం పొలాల వద్దకు వెళ్లిన రైతుల ద్వారా ఇది వెలుగులోకి వచ్చింది. దీనిపై వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి తహసీల్దార్ భార్గవి దృష్టికి తీసుకెళ్లారు.

దేవదాయ శాఖ జేసీ ఆకస్మిక తనిఖీ


ఆలయంలో రికార్డులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్

నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానాన్ని దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీ పళ్లికొండేశ్వరస్వామి దేవాలయంపై వచ్చిన పలు ఫిర్యాదులపై ప్రస్తుత కార్యనిర్వహణాధికారి పి.లత, మాజీ కార్య నిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి సమక్షంలో ఫిర్యాదుదారులతో మాట్లాడి విచారణ చేశారు. ఆలయ రికార్డులను పరిశీలించారు. తదుపరి ఆలయ ప్రదేశాలు సందర్శించారు. గోశాలను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న వసతి గృహాలను కార్తీక మాసంలోపు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఆలయ అర్చకులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారా, లేదా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో శ్రీ, శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన


దుర్గాదేవి విగ్రహం

సత్యవేడు: విజయదశమి నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, కలశ ప్రతిష్ఠ, హోమం, పూజార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 3వ తేదీ నుంచి బాల త్రిపుర సుందరిగా అమ్మవారి అలంకరణ, 4నశ్రీ గాయత్రీదేవిగా అరటి పండ్ల అలంకరణ, 5న శ్రీ అన్నపూర్ణగా కూరగాయలతో అలంకరణ, 6న శ్రీ లలితా త్రిపుర సుందరిదేవిగా పసుపు కొమ్ములతో అలంకరణ, 7న శ్రీ మహాచండి, కాళికాదేవి పండ్లతో అలంకరణ చేపడతారని నిర్వాహకులు రవికుమార్ దేవర్ తెలిపారు.

నీళ్లు తెచ్చిన గొడవ!

వరదయ్యపాళెం: ఇరు కుటుంబాల మధ్య జరిగిన వివాదంలో మహిళపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని కారిపాకంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జున్ కథనం ..కారిపాకంకు చెందిన హేమలత తన ఇంటి వద్ద నీటితో కడుగుతుండగా కడిగిన నీళ్లు తమ ఇంట్లోకి వచ్చాయని ఎదురింట్లో ఉంటున్న శ్రీధర్ అనే వ్యక్తి గొడవ పడ్డాడు. దీనిపై ఇరువురికీ మాటామాటా పెరగడంతో శ్రీధర్ భార్య భారతి ఆవేశంతో అక్కడే ఉన్న కర్రతో హేమలత తలపై కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. ఇంతలోపు శ్రీధర్ తమ్ముడు శేఖర్ అక్కడకు చేరుకుని తమ జోలికి వస్తే చంపుతానంటూ బెదిరించడంతో బాధితురాలు హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం సాయంత్రం పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

చిందేపల్లెలో 'స్వచ్ఛతా హి సేవ'


విద్యార్థులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని చిందేపల్లెలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఐఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు, చెత్తాచెదారం, చిందేపల్లె చెరువు తూము నుంచి పొలాలకు ఉన్న పంట కాలువలో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. డైరెక్టర్ మాట్లాడారు.
పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, స్వచ్ఛతా హి సేవ నోడల్ అధికారి ఆర్ఎస్‌కే చైతన్య, జీవీ సుబ్బారెడ్డి, వెంకటరమణ, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య శిశువుకు జన్మ


గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంపీపీ ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి

సత్యవేడు: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారని ఎంపీపీ వి.ప్రతిమ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పౌష్టికాహార ఉత్సవాలు నిర్వహించారు. ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు పి. విజయలక్ష్మి మాట్లాడారు. పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత సమస్య బారిన పడతారని, ఆ పరిస్థితి రాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. బాలామృతం, కుడుములు, రాగిరొట్టె అటుకులు, పౌష్టికాహార వంటకాలు, ఇతరత్రా వాటితో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం 8మంది గర్భవతులకు సీమంతం చేశారు. చీర, రవిక, గాజులు, కుంకుమ, పండ్లు, పసుపు, కుంకుమ అందజేసి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, ఎంఈఓ–2 ఉష, సూపర్‌వైజర్లు ఏ. చెంచులక్ష్మి(సత్యవేడు), ఎం. జ్యోతి(వరదయ్యపాళెం), శిల్ప (బుచ్చినాయుడుకండ్రిగ) కే.యమున (వరదయ్యపాళెం), అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ, ప్రధానోపాధ్యాయులు

ఏర్పేడు: పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్‌లో బహుమతుల అందజేశారు. గత వారంలో పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు మెమొంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ, ప్రధానోపాధ్యాయులు మధు, సునీత, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల బృందం ప్రతిభ

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె హైస్కూల్ విద్యార్థినుల బృందం క్విజ్, డిబేట్ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ మంగళవారం చెప్పారు. తిరుచానూరు హైస్కూల్‌లో మంగళవారం బాలికా దినోత్సవంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో మాలిక విద్యార్థినుల బృందం జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నట్లు చెప్పారు. వారిని ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, ఉమామహేశ్వర్ అభినందించారు.

ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం


లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమాదేవి గొరినేని తదితరులు

రేణిగుంట: కరకంబాడి సమీపంలోని అమర హాస్పిటల్‌లో మంగళవారం ప్రపంచ హృదయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గొరినేని ప్రజలకు, రోగులకు ప్రపంచ హృదయ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఆస్పత్రిలో రూ.699 హార్ట్ ప్యాకేజీ లోగోను ఆవిష్కరించారు. అలాగే, తిరుపతి అలిపిరి బైపాస్ రోడ్‌లో 'యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్' అనే థీమ్‌తో 5కే 'వాకథాన్' నిర్వహించారు. ఎండీ రమాదేవి మాట్లాడుతూ, తిరుపతిలో గుండె జబ్బులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. అనారోగ్యకరమైన జీవనశైలి, మధుమేహం, రక్తపోటు ప్రమాదాన్ని పెంచి, గుండె సంబంధిత వ్యాధులకు గురిచేస్తున్నాయని విశ్లేషించారు. వీటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో అమర ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటశివకృష్ణ, డాక్టర్ మోహన్, డాక్టర్ రవికుమార్, ఆస్పత్రి సీఏఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు

శ్రీకాళహస్తి: విజయదశమి పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ప్రత్యేక పూజల అనంతరం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ కనకాచలం కనకదుర్గమ్మ ఆలయంలో దసరా వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు ముమ్మరం

కనకాచలంపై ఆలయ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. మెట్ల మార్గంలో విద్యుత్ దీపాలంకరణ, ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.